క్లుప్తంగా

నేడు మంత్రుల పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథ రెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ చవటగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. మంత్రుల పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు కొమరగుంటలో జల్లికట్టు

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట గ్రామంలో ఆదివారం జల్లికట్టు (ఎడ్ల పందేలు)ను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి యువత తరలి రావాలని కోరారు.

బాబు, పవన్ మాటలను నమ్మి మోసపోకండి

శ్రీరంగరాజపురం : చంద్రబాబు, పవన్ మాయమాటలను నమ్మి మోసపోకండి అని గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ నరసింహులు అన్నారు. మండలంలోని తయ్యూరు పంచాయతీలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, మండల అధ్యక్షులు తులసిమణి, మురళీకృష్ణ, అక్బర్, పరదేశి, నారాయణస్వామి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



చికిత్స అందిస్తున్న వైద్యులు

నగరి : పట్టణంలోని సీవీఆర్ కల్యాణ మండపంలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజలక్ష్మి హాస్పిటల్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో రక్తపోటు, షుగర్, స్త్రీ సంబంధిత, పిల్లల సంబంధిత, కంటి చికిత్స, చర్మసంబంధిత వ్యాధులు, ఎముకలు, ఈఎన్‌టీ, సాధారణ వైద్య చికిత్సలు అందజేశారు. 21 మంది వైద్యులు సుమారు 700 మంది పేషంట్లను పరీక్షించి మందులు అందించారు. యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ రామ్‌ప్రసాద్, నగరి బ్రాంచ్ మేనేజర్ యువరాజ్, ఏఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాంప్రసాద్ రెడ్డి

నింద్ర: మండలంలోని ఎలకాటూరు సర్పంచ్ చంద్రబాబు అత్త కమలమ్మ(68)శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి ఆగ్రామానికి వెళ్లారు. మృతదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. అంతక్రియలకు రోజా చారిటబుల్ ట్రస్టు కింద రూ.10 వేలు అందించారు. ఎంపీపీ దీప, నాయకులు దీనకర్, జలంధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: కాలభైరవేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు చికరాకులపల్లెకు చెందిన నందనూరు వంశస్తులచే కల్యాణోత్సవ సేవను భక్తితో నిర్వహించారు. ఉభయదారులు అమ్మవారికి, స్వామికి సారెలు, పూజాసామిగ్రి, ప్రసాదాలు, పండ్లు, మంగళసూత్రంను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు పార్వతీపరమేశ్వరులను ప్రత్యేక అలంకరణ చేయించి శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పఠనం చేస్తూ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు విశేషంగా విచ్చేశారు. రాత్రి ఉభయదారులు స్వామికి ప్రసాదాలు, సుగంధ పుష్పాలు, పూజాసామగ్రి ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. పల్లకిలో స్వామివారు అశ్వవాహనంపై కొలువుదీరి ఊరేగారు.

నగరికి ఆధునిక హంగులు

- రూ. 9.5 కోట్ల నిధులతో భారీ ప్రణాళిక
- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జి–అరేనా కన్వెన్షన్ సెంటర్
- ఫ్యామిలీ రెస్టారెంట్, కమ్యూనిటీ హాల్, స్విమ్మింగ్‌పూల్
- పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా



టూరిజం శాఖ పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : నగరి పట్టణానికి ఆధునిక హంగులు సమకూరనున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ పరిధి ఏపీ టూరిజం ప్రాంగణంలో టూరిజం శాఖ సహకారంతో రూ.9.5 కోట్ల నిధులతో నిర్మించనున్న జి–అరేనా కన్వెన్షన్ సెంటర్, ఫ్యామిలీ రెస్టారెంట్, స్విమ్మింగ్ పూల్, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల సంక్షేమం, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తనను గెలిపిస్తే నగరి నియోజకవర్గ రూపురేఖలు మార్చి చూపిస్తా అంటూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు వాగ్దానం చేశానని, ఆ మేరకు ప్రమాణాలను పెంచే విధంగా ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఆర్టీవో కార్యాలయం, పార్కులు, డయాలసిస్ వార్డు, కళాశాలలకు నూతన భవనాలు, ఆధునిక శ్మశాన వాటికలు, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గానికి శిల్పారామం మంజూరు చేయించానని, ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిని పెంచే విధంగా పలు భవనాల నిర్మాణాలకు భూమి పూజ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ అరిమంద వరప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, ఇంద్రయ్య, మురుగ కో–ఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, నాయకులు మునివేలు, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

నెట్టేరి పరిధిలో రూ.11.40 కోట్ల సంక్షేమం

నింద్ర: సంక్షేమానికి చిరునామా సచివాలయం అని మంత్రి రోజా అన్నారు. శనివారం మండలంలోని నెట్టేరి గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామ పరిధిలోనే అదికూడా ఇంటికి సమీపంలోనే ప్రభుత్వ సేవలు అందించే సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని తెలిపారు. నెట్టేరి సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.11.44 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. అలాగే నెట్టేరి పరిధిలోని నిరుపేదలకు మంత్రి రోజా ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, తహసీల్దార్ నాగమణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, కోఆప్షన్ సభ్యుడు అనిల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, పంచాయితీ ఏఈ వీరభద్రం, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.



నింద్ర : ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

పల్లెకు పట్టం కట్టిన నేత జగనన్న



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి ఆర్కే రోజా

విజయపురం : పల్లెకు పట్టం కట్టిన నేత సీఎం జగనన్న అని రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మండలంలోని ఆలపాకం, కళియంబాకం గ్రామాల్లో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బీకే సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో పల్లెలు అభివృద్ధి పథాన నడుస్తున్నాయని తెలిపారు. ఆలపాకం సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.20.10 కోట్ల మేర సంక్షేమాన్ని అందించామని, రూ.1.37 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అలాగే కళియంబాకం సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద 21.05 కోట్లు అందించామని, రూ. 96.95 లక్షలు మేర అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఇలా ప్రతి పల్లెలోను అభివృద్ధి, సంక్షేమం మెండుగా జరుగుతున్నాయన్నారు. పల్లె ప్రజలకు పాలన చేరువైందని తెలిపారు. ఈ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



పెద్దకాలవ సచివాలయ భవనం వద్ద ప్రజలతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- రూ.3కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం



ఎల్లమ్మరాజుపల్లె బస్టాప్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం, ఎంపీ, కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు: గ్రామీణ అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని పెద్ద కాలవ పంచాయతీలో దాదాపు రూ.2కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను శనివారం ఆయన ఎంపీ రెడ్డప్పతో కలిసి ప్రారంభించారు. పెద్ద కాలవ పంచాయతీ ఎల్లమ్మ రాజు పల్లి వద్ద నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, చెర్లోపల్లి గ్రామం వద్ద నిర్మించిన సచివాలయం భవనం, ఎల్లమ్మరాజు పల్లె వరకు వేసిన సీసీ రోడ్డు నిర్మాణం, నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, ఎల్లమ్మరాజు పల్లి వద్ద నిర్మించిన బస్ షెల్టర్లను, తూగుండ్రంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని డిప్యూటీ సీఎం, ఎంపీతోపాటు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ అనిత లాంఛనంగా ప్రారంభించారు. డిప్యూటీ సీఎం, ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేసిన ఏకైక సీఎం జగనన్న అని చెప్పారు. గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజల అవసరాల కోసం ఇంతలా కృషి చేయలేదని గుర్తుచేశారు. జగన్ మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు వైపు పెత్తందారులు ఉంటే, జగనన్న వైపు పేద ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి, సంక్షేమ సారథి నవరత్న రూపశిల్పి అయిన జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, పెద్ద కాలవ గ్రామ సర్పంచ్ ఏకాంబరం, తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు, రాష్ట్ర గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ శాఖ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముని రాజారెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, రైతు భరోసా కేంద్రాల అధ్యక్షుడు బలరాంరెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీలు దుర్వాసులు, వాణిశ్రీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన కొల్ల.. జన జాతర



నగరి: క్రేన్‌లో వేలాడుతూ వచ్చి అమ్మవారికి పూలదండ వేస్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ అంకాల పరమేశ్వరి ఆలయంలో శనివారం శ్మశాన కొల్ల (మయానకొల్ల) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కుశస్థలీ నది గట్టున ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహాశివరాత్రి పర్వదినం తరువాత ఈ ఉత్సవాలు జరుగుతాయి. పర్వతరాజ కులస్తులు తరతరాలుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కుశస్థలి నదిలో సుమారు 20 అడుగుల పొడవున్న దక్షుడి మట్టిబొమ్మను తయారుచేశారు. అంకాళ పరమేశ్వరి అమ్మవారికి మహిషాసుర మర్దిని అలంకరణ చేసిన అనంతరం మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా నది వద్దకు తీసుకెళ్లారు.దక్ష సంహారం అనంతరం మళ్లీ అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి వేంచేపు చేశారు.

అంకాళ పరమేశ్వరి సేవలో మంత్రి రోజా..

అంకాళ పరమేశ్వరిని మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. నిర్వాహకులు మంత్రి రోజాను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా చేనేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, నాయకులు అయ్యప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- సంక్షేమ సారథికి ఆడపడుచులే అండ
- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే జగనన్న లక్ష్యం అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి విచ్చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదిక వద్దకు చేరుకొని సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతపై ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే జగనన్న ఆశయం అని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ ద్వారా పొదుపు సంఘాలకు మన ప్రభుత్వం మళ్లీ ఊపిరి పోసిందన్నారు. వీటిని జీర్ణించుకోని ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్ కలిసి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో అవినీతి రాజ్యం ఏలిందని గుర్తు చేశారు. నేడు రాష్ట్రం సంక్షేమ పథకాలతో విరాజిల్లుతోందని చెప్పారు. మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయండి లేకపోతే ఓటు వేయొద్దు అని చెప్పిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

మహిళ పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. ఈ సారి కూడా ఫ్యాను గుర్తుపై ఓటేసి జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల మహిళలకు ఎన్నో రకాలుగా సాయం అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మహిళా లోకం అండగా నిలబడాలని కోరారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, జగనన్నతోడు వంటి పథకాలతో పాటు, ఆడబిడ్డల రక్షణ కోసం దిశ యాప్, పోలీసు స్టేషన్‌లను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్నను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, మండల కన్వీనర్ మణి, స్థానిక సర్పంచ్ హరిత, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.



వీర్లగుడి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాలసముద్రం : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నెహ్రూ యువకేంద్రం చిత్తూరు రూరల్, యాక్షన్ సంస్థ నిర్వాహకుడు చిట్టిబాబు తెలిపారు. వీర్లగుడి, ఆముదాల గ్రామాల్లో శనివారం మహిళా సాధికారత నారీశక్తి ఫిట్‌నెస్ రన్ నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని తెలిపారు. క్రీడా సంస్కృతి, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రాజకుమారి, శరణ్యదివ్య, ఉమ, రేఖ, శిరీష, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేసుకోవాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. వచ్చిన గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, హెచ్‌బీఎస్ఏజీ వంటి పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతోపాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మలింగేశ్వరస్వామి పాహిమాం



భక్తులకు అన్నదానం చేస్తున్న ధర్మకర్త



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలోని పల్లేరుకోనలో వెలసిన శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు శనివారం కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో ఆత్మలింగేశ్వర స్వామివారిని మేల్కొల్పి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి సర్వాంగ సుందరంగా, విశేషాలంకారంతో ఆత్మలింగేశ్వర స్వామి ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉభయదారులుగా వాసునాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇందులో ధర్మకర్త మోహన్‌నాయుడు, స్థానిక సర్పంచ్ హరిత, ఎస్ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, సేతురెడ్డి, హరినాయుడుతోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శివ, పార్వతమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని సింహరాజపురంలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని శనివారం శివ, పార్వతమ్మలకు ప్రత్యేక పూజలు చేసి, వైభవంగా శ్మశాన కొల్ల జరుపుకున్నారు. ఉదయం శివపార్వతులను పుష్పపల్లకిపై కొలువుదీర్చి వేదపండితులు దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో డ్రమ్స్ కొడుతూ యువకులు నృత్యం చేస్తూ ఊరేగించారు. ఊరేగింపులో ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పలుప్రాంతాల నుంచి విచ్చేసిన జనంతో గ్రామంలో సందడి నెలకొంది





అమ్మవారికి కర్పూర హారతి, ఊరేగింపులో వివిధ వేషధారణల్లో భక్తులు

ఆలయంలో అన్నదానం



కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మండల కేంద్రానికి చెందిన బాబు కుటుంబ సభ్యులు శనివారం అన్నదానం చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలయంలో దాతల కోరుకున్న రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహణకు అనుమతి ఇస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమంతో భక్తుల సేవకు దాతలు ముందుకు రావాలని కోరారు.

సిమెంటు రోడ్లు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్కే సెల్వమణి

నగరి : మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను మంత్రి ఆర్కే రోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి శనివారం ప్రారంభించారు. పద్మావతినగర్, ఆనం లలితా లేఅవుట్, తంబానాయుడు లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్ ఇంద్రయ్య, మోహన్‌రాజ్, మురుగ, నాయకులు ఎల్లప్పరెడ్డి, బాబు, ఇళంగో తదితరులు పాల్గొన్నారు.